క్లుప్తంగా

షిర్డీసాయికి పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఇలిసిపురం, ద్వారకానగర్‌లోని షిరిడీసాయి బాబా సేవా సంస్థాన్ మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మూడు హారతులు, అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రణాళికలు రూపొందించండి



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో సర్పంచ్‌లకు వార్షిక, ప్రజా ప్రణాళికలపై శిక్షణ తరగతులను ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వార్షిక ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ రమాదేవి, ఈఓ పీఆర్డీ ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పైడి భాస్కరరావు, నేతింటి నీలమప్పడు, పంచిరెడ్డి రాంబాబు, దుంప చిన్నారెడ్డి, అల్లుపల్లి రాంబాబు, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య జెండాల పంపిణీ



జెండాలు కడుతున్న యువత

శ్రీకాకుళం కల్చరల్: అయోధ్య రామ మందిర ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా బలగ బుచ్చిపేట రామ మందిరం శ్రీరామయూత్ సభ్యులు గురువారం ఇంటింటా జెండాలు పంపిణీ చేశారు. ఆంజనేయస్వామి, అయోధ్య రామమందిర ఫొటోలతో కూడిన సుమారు 300 జెండాలను పంపిణీ చేసినట్లు యూత్ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని అదపాక గ్రామానికి చెందిన కుప్పలి రమేష్ (36) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గురువారం మృతి చెందారు. ఈ నెల 16వ తేదీన బెజ్జిపురం నుంచి అదపాకకు బైక్‌పై వెళ్తుండగా భీమునిపాలెం వద్ద బోల్తా పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లావేరు ఏఎస్సై బీకేవీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కులగణన

ఎచ్చెర్ల: లావేరు మండలంలో శుక్రవారం నుంచి కులగణనను ప్రారంభించనున్నామని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ, బీపీడీపీ కార్యక్రమంపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, లుకలాపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.సురేష్, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలు పంపిణీ



గ్రామస్తులకు అక్షతలు అందజేస్తున్న శ్రీనుస్వామి

ఎచ్చెర్ల: మండలంలోని ఇబ్రహీంబాద్‌లో శ్రీనుస్వామి ఆధ్వర్యంలో ఇక్కడ ఉన్న రామాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆయోధ్య నుంచి వచ్చిన అక్షతలు గ్రామస్తులకు పంచిపెట్టారు. మాజీ జెడ్పీటీసీ సనపల నారాయణరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పేదలకు దుస్తుల వితరణ

రణస్థలం: సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు గురువారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. టీమ్ తారక్ ట్రస్ట్ పేరున ఎన్టీఆర్ అభిమానులు అల్లివలసలో పేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేశారు.

మార్కెట్‌కు మహర్దశ

- పొట్టి శ్రీరాములు మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- రూ.1.10 కోట్లతో మార్కెట్ రోడ్లు
- వ్యాపారులు, కొనుగోలుదారులకు తీరిన ఇక్కట్లు



పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో విశాలమైన సీసీ రహదారి



శ్రీకాకుళం: సుమారు 75 ఏళ్ల చరిత్ర కలిగి, శ్రీకాకుళం నగర నడిబొడ్డున ఉన్న పొట్టి శ్రీరాములు మార్కెట్‌ను గత పాలకులు గాలికొదిలేశారు. రోడ్లు అధ్వానంగా ఉన్న పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మార్కెట్ కొత్త రూపు సంతరించుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మార్కెట్‌పై నిత్యం రద్దీగా ఉంటుంది. నగర జనాభాలోని 70 శాతం మంది ఈ మార్కెట్‌పైనే ఆధారపడి కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తుంటారు.

కొత్తగా రోడ్లు..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, రోడ్లు అభివృద్ధి చేశారు. మార్కెట్‌లో రోడ్లు కూడా నాడు–నేడులో అభివృద్ధి చేయాలని స్థానిక వ్యాపారులు, కొనుగోలుదారులు కోరగా.. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసింది. మార్కెట్ లోపల, బయట, పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించింది. మార్కెట్‌ను ఆనుకుని ఉన్న పాత బస్టాండ్‌లో సైతం రూ.20 లక్షలతో రోడ్డు అభివృద్ధి చేశారు. కాగా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలోనే మార్కెట్‌లోని భవనాలకు మోక్షం కలిగింది. 1998లో అప్పటి సీఎం చంద్రబాబు మార్కెట్‌ను సందర్శించి శిథిలావస్థలో ఉన్న భవనాలను రూ.కోటి ఖర్చుతో అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. 2004 వరకు కార్యరూపం దాల్చలేదు. 2004లో వైఎస్సార్ సీఎం అయ్యాక అప్పటి రెవెన్యూ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు ద్వారా మార్కెట్ సమస్యను తెలుసుకుని రూ.4 కోట్ల ఖర్చుతో భవనాలు అభివృద్ధి చేశారు. తర్వాత వైఎస్సార్ తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే రోడ్లకు మోక్షం కలిగింది.



శ్రీకాకుళం పాతబస్టాండ్‌లో సీసీ రోడ్డు

మార్కెట్ అభివృద్ధి..



కూరగాయలు మార్కెట్‌కు వెళ్లాలంటే ఎంతో సౌకర్యవంతంగా ఉంది. గతంలో రోడ్లు పూర్తిగా పాడై అధ్వానంగా ఉండేవి. రోడ్లుపై మురుగునీరు ప్రవహించేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

– కళ్యాణి,
విశాఖ–బి కాలనీ, శ్రీకాకుళం

సౌకర్యంగా ఉంది



మార్కెట్‌ను పునర్నిర్మాణం చేయకముందు, రోడ్లు వేయకముందు వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు మార్కెట్ సౌకర్యవంతంగా ఉంది.

– అంధవరపు రామారావు,
వర్తక సంఘం నాయకుడు, శ్రీకాకుళం

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సంతవురిటిలో సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సంతవురిటిలో గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే భవనాలను గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని ఇప్పుడు చూస్తున్నామన్నారు. గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థల వైపు అన్ని రాష్ట్రాలు చూస్తున్నామన్నారు. సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం ప్రజలకు చేరువయ్యేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ మీసాల సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, పంచిరెడ్డి లలితాకుమారి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జిల్లా జేసీఎస్ కన్వీనర్ పిల్లల శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



యువకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్ : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు హెచ్చరించారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు గురువారం నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో యువకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రిబుల్ రైడింగ్, అతివేగంతో వాహనాలు నడపటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. అనంతరం నిబంధనల ప్రకారం వాహనాలు నడుపుతామంటూ యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హరికృష్ణ, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు రమణ, వాసు, పున్నయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కుల మతాలకు అతీతంగా అన్నివర్గాల హక్కులకు, అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. సామాజిక సమతా సంకల్ప మహోత్సవంలో భాగంగా అంబేడ్కర్ కూడలి వద్ద రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుసుకుని ఆయన సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సోషల్‌వెల్ఫేర్ డీడీ, డీఆర్‌డీఏ పీడీ, ట్రైనీ కలెక్టర్, డీపీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



పాతబస్టాండ్ వద్ద మాస్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: కరోనా నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా నగర ప్రజలంతా ఆరోగ్య సూత్రాలు పాటించాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు కోరారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి సామాజిక బాధ్యతగా పాతబస్టాండ్, పొట్టి శ్రీరాములు మార్కెట్ కూడలిలో మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా రహిత జిల్లాగా శ్రీకాకుళం ఉండాలనే ఉద్దేశంతో మాస్కులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సామాజిక సేవకుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నవజీవనరావు, సంఘ సేవకుడు మంత్రి వేంకటస్వామి చేతుల మీదుగా 1600 మాస్కులు అందజేశారు. కార్యక్రమంలో ఉర్లాం శివతేజ, నంది ఉమాశంకర్, లయన్స్ క్లబ్ సెంట్రల్ ట్రజరర్ శిల్లా మణికంఠ, చేయూత మేమున్నాం సంస్థ అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకట లక్ష్మీ, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు హాటకేశం, పొడుగు చరణ్, స్మాల్ సర్వీస్ టు సొసైటీ ప్రతినిధి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్

శ్రీకాకుళం రూరల్: అధిక దిగుబడులు సాధనకు ఆధునిక సాగు పద్ధతులపై విశ్లేషణ చేయాలని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా గురువారం నైరా దత్తత గ్రామమైన పల్లివలసలో శిబిరం నిర్వహించారు. సాగు పద్ధతులు, శ్రీవరి సాగు విధానాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవసాయ విస్తరణాధికారి బి.చిన్నంనాయుడు, ఆత్మ పీడీ రామచంద్రరావు, ఆర్థికశాస్త్ర నిపుణులు సునంద తదితరులు పాల్గొన్నారు.

అధిక వేగంతో ప్రయాణిస్తే ప్రమాదాలు



తుమ్మావీధిలో యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

శ్రీకాకుళం క్రైమ్ : యువకులు మితిమీరిన స్పీడ్‌తో ద్విచక్ర వాహనాలను నడిపి ప్రమాదాల బారిన పడవద్దని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ లక్ష్మణరావు అన్నారు. గురువారం రాత్రి నగరంలోని తుమ్మావీధి, కత్తెర వీధుల్లో ట్రాఫిక్ నిబంధనలపై యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇన్సూరెన్సు చేసుకోవాలని, లైసెన్సు లేకుండా వాహనం నడపరాదని, హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్‌రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని, మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. ర్యాష్ డ్రైవ్‌తో ఇటీవల కొందరు యువకులు ప్రమాదాలు కొనితెచ్చుకోవడమే కాక ఇతరుల ప్రాణాలమీదికి తెచ్చారని గుర్తు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రంక్‌కు సంబంధించి ట్రాఫిక్ పోలీసులతో సంబంధం లేకుండా ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అ'పూర్వ' కలయిక



గార మండలం కళింగపట్నం కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998-99లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కళాశాలలో నిర్వహించారు. 25 ఏళ్ల తరువాత కలుసుకున్న వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ గత స్మృతులను నెమరివేసుకుంటూ ఆనందంగా గడిపారు. ప్రతి ఏడాది ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. –గార

వైభవంగా పైడితల్లి జాతర



జాతరకు తరలివచ్చిన భక్తులు

జి.సిగడాం: గెడ్డకంచరాంలో పైడితల్లిమ్మ వారి జాతర మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. గత మూడు రోజుల నుంచి ఈ ఉత్సవాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నిరుపేదలకు వస్త్రాల వితరణ



టెక్కలి: మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

టెక్కలి: పట్టణానికి చెందిన తథాగత సంఘమిత్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిరుపేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ మూడేళ్లుగా ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ పట్నాన చంద్రిక, ప్రతినిధులు చీపురు కృష్ణారావు, డి.శ్రీనివాసరావు, డి.వెంకటరావు, పి.సోమశేఖర్, శ్రీనివాసరావు, సూర్యుడమ్మ, లక్ష్మీ, పద్మ, లీనా, మల్లిక పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో తిలక్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు పైల జయలక్ష్మి 20 మంది అనాథ మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

బెంకిలి కార్యదర్శికి అభినందనలు

సోంపేట: మండలంలోని బెంకిలి పంచాయతీ సచివాలయ కార్యదర్శి బి.శ్రీనివాసరావును ఎంపీపీ నిమ్మన దాస్, ఎంపీడీఓ బి.వెంకటరమణ గురువారం అభినందించారు. చెత్తతో సంపద తయారీ కేంద్రం నిర్వహణలో బెంకిలి క్లాప్‌మిత్ర కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ నెల 26న ఢిల్లీలో ప్రధానమంత్రి సమక్షంలో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



కబడ్డీ విజేతలకు అభినందనలు తెలియజేస్తున్న సాయికుమార్

రణస్థలం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. ఆడుదాం–ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. క్రికెట్‌లో కొవ్వాడ, ఖోఖోలో పాతర్లపల్లి, కబడ్డీలో చిల్లపేటరాజాం, బ్యాడ్మింటన్‌లో జే.ఆర్.పురం, కొవ్వాడ వాలీబాల్ జట్లు గెలిపొందాయి. ఈ జట్లుకు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. త్వరలో జరిగే నియోజకవర్గ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు. ఎంపీడీఓ రమణమూర్తి, ఏఓ ధనంజయరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రెడ్డి విశ్వేశ్వరరావు, నాయకులు మైలపల్లి అప్పన్న, రాముడు, జక్కంపూడి అచ్చిరాజు, మండల స్పోర్ట్స్ అధికారి సీహెచ్ రాము, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బెంతో ఒరియాల సమస్యలు పరిష్కరించాలి



ఇచ్ఛాపురం: మానవహారంగా ఏర్పడిన బెంతో ఒరియా కులస్తులు



కవిటి : దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్

ఇచ్ఛాపురం/కవిటి/కంచిలి: బెంతో ఒరియా కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కవిటి మండలం నుంచి ఇచ్ఛాపురం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలికి చేరుకుని మానవహారం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్లు లేక బెంతో ఒరియా విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుల పెద్దలు రజనీకుమార్ దోళాయి, శివబిసాయి, మోహన్‌సాహు, సుమన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కవిటిలో ఏర్పాటు చేసిన బెంతో ఒరియాల దీక్షా శిబిరాన్ని వైఎస్సార్ సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్, మాజీ ఎంపీపీ పీఎం తిలక్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పూడి లక్ష్మణరావు, బద్రి ప్రకాష్, వై నీలయ్య తదితరులు పాల్గొన్నారు. బెంతొరియాలకు నిలిపివేసిన కులధృవీకరణ పత్రాలు తిరిగి జారీ చేయాలని జిల్లా బెంతొరియా సంఘ కార్యదర్శి శివ బిసాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు బెంతొరియా సంఘం ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన నిరసన బైక్ ర్యాలీ కవిటి, ఇచ్ఛాపురం మీదుగా కంచిలి చేరుకుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు.

క్రీడలతో స్నేహసంబంధాలు బలోపేతం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న వరప్రసాదరావు

కవిటి: క్రీడల నిర్వహణతో యువత మధ్య స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని రిటైర్డ్ డీఎస్పీ శమళ్ల వెంకట వరప్రసాదరావు అన్నారు. గురువారం వింధ్యగిరి క్రీడామైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవిటి, ఇచ్ఛాపురం మండలాలస్థాయి క్రికెట్‌టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వరప్రసాదరావు బ్యాటింగ్ చేయగా, ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయెల్ రాజు బౌలింగ్ చేసి పోటీల్ని లాంఛనంగా ప్రారంభించారు. ఏటా సంక్రాంతి సందర్భంగా టోర్నీ నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సేవలను ప్రశంసించారు.